మార్కెట్లకు చవితి శోభ

వినాయచ చవితి సందర్భంగా మార్కెట్లు కళకళలాడుతున్నాయి. వినాయక ప్రతిమలు విక్రయించే దుకాణాలు, పూజా సామగ్రి విక్రయించే అంగళ్లు కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్నాయి. పూర్ణా మార్కెట్, అల్లిపురం, దొండపర్తి తదితర ప్రాంతాలన్నీ చవితి శోభతో విరాజిల్లు తున్నాయి. ఎక్కడ చూసినా కొనుగోలు దారులు, అమ్మకందారులతో రోడ్లన్నీ కిటకిటలాడుతున్నాయి. ఇసుక వేస్తే రాలనంత జనం ఆయా మార్కెట్లలో కనిపిస్తున్నారు. వాహనాల రాకపోకలకు వీలు కాకపోవడం వల్ల కొనుగోలుదారులు మార్కెట్ల వెలుపల ఎక్కడో ఖాళీ స్థలంలో తమ వాహనాలు నిలిపి పూజా సామగ్రి కొనుక్కోవాల్సిన పరిస్థితి కనిపించింది.


పూర్ణామార్కెట్‌లో పూజా సామగ్రి అమ్మకాలు

- ఆకాశాన్నంటిన ధరలు
- గణపతి పూజకు సై


అల్లిపురంలో పండ్లు కొనుగోలు చేస్తున్న భక్తులు

జగదాంబ : వినాయచ చవితి సందర్భంగా పూర్ణా మార్కెట్‌లో విపరీతమైన రద్దీ నెలకొంది. పాద చారులు, వాహన చోదకులతో రాకపోకలు కూడా సాగించే పరిస్థితి కనిపించలేదు. మార్కెట్ రద్దీ నియంత్రణలో పోలీసులు తీవ్రంగా శ్రమించారు. టర్నర్ చౌల్ట్రీ నుండి పూర్ణామార్కెట్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. చవితి సందర్భంగా ధరలు ఆకాశాన్ని అంటాయి. 50 గ్రాముల పువ్వులు రూ.150 పైగా విక్రయించారు. అలంకరణ వస్తువులైన టోపీలు, ప్లాస్టిక్ పువ్వుల దండలు ఎక్కువగా అమ్ముడుపోయాయి. అరటిపండ్లు కిలో రూ. 100కి పైగా, దానిమ్మ రూ. 300, యాపిల్ రూ. 200 నుంచి రూ. 350 వరకు అమ్మకాలు జరిగాయి. నల్ల ద్రాక్ష, సీతాఫలాల ధరలు ఒక మాదిరిగా ఉన్నా, వెలంకాయలు, పత్రి, అరటిదొప్పల ధరలు ఆకాశాన్ని అంటాయి.

అల్లిపురం : వినాయక చవితి సందర్భంగా అల్లిపురం మార్కెట్ సందడిగా మారింది. వినాయక చవితి సందర్భంగా సుమారు 21 పత్రాలతో స్వామికి పూజలు చేస్తారు. దీంతో మార్కెట్లో రకరకాల పత్రులు వ్యాపారులు కుప్పగా పోసి అమ్ముతారు. మామూలు సమయంలో వాటిని కనీసం ముట్టుకోని వారు కూడా గణపతి పూజకు వాటిని భక్తిశ్రద్ధలతో కొనుగోలు చేయటం విశేషం. దీనిని అవకాశంగా చేసుకుని వ్యాపారులు వాటి ధరలు కూడా పెంచి అమ్మారు. ఒకప్పుడు రూ.10 విలువ చేసే పత్రి ఇప్పుడు రూ.50 పలుకుతోంది. అదే విధంగా 21 రకాల పండ్లు.. ముఖ్యంగా యలంకాయ, మారేడు కాయ, కొబ్బరి పువ్వు ఇతర పండ్ల ధరలు పెరిగిపోయాయి. పువ్వుల ధరల విషయం అయితే చెప్పనవసరం లేదు. డజను చామంతులు రూ.20 నుంచి రూ.30 అమ్మకాలు జరిపారు. అరటి ఆకులు ఒకటి రూ.5 నుంచి రూ.10, డజను అరటి పండ్లు రూ.80 నుంచి రూ.120, కొబ్బరికాయ రూ.25 నుంచి రూ.40కి విక్రయించారు. వినాయక ప్రతిమలు కొనుగోలు చేసేందుకు ముఖ్యంగా చిన్నారులు సందడి చేశారు. రంగు రంగుల బొమ్మలు, వివిధ రూపాల్లో కనువిందు చేయటంతో ఏ బొమ్మ కొనాలన్న మీమాంసలో పడిపోయారు. బేరం కుదుర్చుకుని బొజ్జగణపతికి జై.. అంటూ గణపతి బొమ్మతో ఆనందంగా తరలివెళ్లిన దృశ్యాలు ఆకట్టుకున్నాయి. కొనుగోలుదారులు, వ్యాపారులతో అల్లిపురం కుమ్మరవీధి కళకళలాడింది. వినాయ ప్రతిమలు కొనుగోలు చేసేవారు, పత్రి, పూలు, పూజా సామగ్రి కొనుగోలు చేసేవారితో మార్కెట్ కిక్కిరిసిపోయింది.


రద్దీ వల్ల పూర్ణామార్కెట్‌లో నిలిచిపోయిన ట్రాఫిక్


పూర్ణామార్కెట్‌లో పళ్లు, పత్రి అమ్మకాలు


పూర్ణామార్కెట్‌లో పూల అమ్మకం


అల్లిపురంలోని పూల దుకాణం


పూర్ణామార్కెట్‌లో అమ్మకానికి సిద్ధమైన పాలవెల్లులు, గొడుగులు


అల్లిపురంలో పత్రి, పండ్లు, పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు


క్లుప్తంగా

వర్షాకాలం వ్యాధుల పట్ల అప్రమత్తం


అచ్చియ్యమ్మపేటలో దోమ లార్వాలను గుర్తిస్తున్న ఆశ వర్కర్లు, మలేరియా సిబ్బంది

అల్లిపురం : వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, డెంగ్యూ, మలేరియా వ్యాధుల నివారణకు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అచ్చియ్యమ్మపేట సచివాలయం పరిధిలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మలేరియా హెల్త్ సూపర్‌వైజర్ కేఎస్‌వీ కుమార్ ఆధ్వర్యంలో కొబ్బరితోటలో డెంగ్యూ, మలేరియా వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ చేపట్టారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, మూడు చెత్త బుట్టల విధానం అమలు చేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి మంచినీటి తొట్టెల్లో దోమ లార్వాలను గుర్తించి వాటిని ఒలకబోశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ జి.సత్యనారాయణ, జీవీఎంసీ ఎంపీహెచ్‌ఏ రమేష్‌కుమార్, ఏఎన్‌ఎం మదీనమ్మ, సుభాషిణి, ఆశ వర్కర్ వి.శ్రీదేవి, పి.లక్ష్మి, పి.నాగలక్ష్మి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ


క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

ఆదిశక్తి అమ్మవారి దేవాలయ ముఖద్వారం ప్రారంభం


ఆదిశక్తి అమ్మవారి ఆలయ ముఖద్వారం వద్ద వాసుపల్లి, తోట పద్మావతి తదితరులు

అల్లిపురం : కొబ్బరితోటలో గల ఆదిశక్తి అమ్మవారి ఆలయ ముఖద్వారానికి మరమ్మతులు చేసి శుక్రవారం పునః ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ అమ్మవారు కొబ్బరితోట వాసులను చల్లగా చూడాలని ఆశించారు. తోట పద్మావతి మాట్లాడుతూ వాసుపల్లి గణేష్‌కుమార్ అందించిన ఆర్థిక సహకారంతో ఆదిశక్తి అమ్మవారి ముఖద్వారాన్ని పునర్నిర్మించినట్లు తెలిపారు. అనంతరం వారు అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, కొబ్బరితోట వాసులు వాసుపల్లిని, తోట పద్మావతిని సత్కరించారు. ఎరిన్నమాంబ అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ లండా రమణ, వార్డు సీనియర్ నాయకులు లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గణపతి పూజలకు వేళాయె

- వాడవాడలా వెలసిన పందిళ్లు


భక్తులకు మట్టి విగ్రహాలు అందజేస్తున్న దేవదాయ శాఖ సహాయ కమిషనర్ శిరీష


అల్లిపురంలో విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్న కళాకారుడు

అల్లిపురం : వినాయక చవితి పూజలకు సర్వం సిద్ధమైంది. అందులో భాగంగా నేను రెడీ అవుతున్నా అన్నట్లుంది వినాయక విగ్రహం. అల్లిపురం కుమ్మరవీధిలో వినాయక విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న కళాకారుడు తొమ్మిది రోజుల పాటు పూజలందుకునే లంబోదరుడిని తీక్షణంగా తీర్చిదిద్దుతూ కనిపించాడు.

మట్టి విగ్రహాలనే పూజిద్దాం..

మట్టి విగ్రహాలనే పూజిద్దాం.. పర్యావరణాన్ని రక్షిద్దాం అంటూ వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరపల్లి రాము పిలుపునిచ్చారు. అల్లిపురం మెయిన్‌రోడ్డులో గల వరసిద్ధి వినాయక ఆలయం వద్ద సుమారు వెయ్యి మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. అల్లం అప్పారావు, పీవీఎస్ రెడ్డి, ఆర్.రామలింగారెడ్డి, డి.శ్రీనివాస్, లక్ష్మి, ఆలయ అర్చకుడు పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాల పంపిణీ..

దాబాగార్డెన్స్ : మట్టి గణపతిని పూజిస్తే పుణ్యం కలుగుతుందని సంఘ సేవకుడు, న్యూ భారత్ సప్లయర్స్ అధినేత చిట్లూరి గిరిధర్ పిలుపునిచ్చారు.


అల్లిపురం మెయిన్‌రోడ్డులో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న పచ్చిరపల్లి రాము తదితరులు

సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా పర్యావరణ పరిరక్షణ కోరుతూ 2 వేల మట్టి గణపతి విగ్రహాలు, 2 వేల తులసి మొక్కలు, 2 వేల వినాయక వ్రతకల్ప పుస్తకాలు భక్తులకు దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె. శిరీష చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతిలో భాగమైన మట్టితో తయారు చేసిన గణపతి ప్రతిమను సాంప్రదాయ రీతిన పూజిస్తే దైవానుగ్రహం కలుగుతుందన్నారు. గత 21 ఏళ్లుగా మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్న చిట్లూరి గిరిధర్ దంపతులను అభినందించారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సీహెచ్ విజయలక్ష్మి, సీహెచ్ నవ్యశ్రీ, దశరథ్, మన్మథ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడిని పూజిస్తే అన్నీ విజయాలే

సీతమ్మధార : వినాయకుడిని పూజిస్తే విజయాలు దరి చేరుతాయని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి పేర్కొన్నారు. ఆశీలమెట్టలోని వేమన మందిరంలో ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య, ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి వినాయక విగ్రహాలు, వ్రతకల్పం పుస్తకాలు, పూలు, పండ్ల మొక్కల పంపిణీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పి.వి.రమణమూర్తి, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.నారాయణ్, ఎ.సాంబశివరావు, డి.రవికుమార్, ఉపాధ్యక్షుడు కె.మురళీకృష్ణ, కృష్ణమూర్తి, ఆనంద్, పి.వేణుగోపాల్, నగేష్‌నాయుడు, సత్యనారాయణ, ఈశ్వరరావు, అనూరాధ, దేవత్రినాథ్, రమేష్, వి.జగన్మోహనరావు, మహేష్‌బాబు, సాయి, చక్రపాణి, కేవీ శర్మ పాల్గొన్నారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీపార్కులో జర్నలిస్టులకు మట్టి వినాయక విగ్రహాలు, వ్రతకల్పం పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామచంద్రరావు, వాల్మీకి నాగరాజు, చందుయాదవ్, చంద్రమోహన్, సురేష్, ఎల్లాజీ, అవతార్, ఉషారాణి, పృధ్వి, కమలుద్దీన్, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

'ఎమర్జెన్సీ సినిమా విడుదలకు సహకరించాలి'

సీతమ్మధార : ప్రముఖ బాలీవుడ్ హీరోయిన్ కంగనారనౌత్ నిర్మించిన ఎమర్జెన్సీ సినిమా విడుదలకు సహకరించాలని జనజాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు కోరారు. ఈ మేరకు ఆశీలమెట్ట జీవీఎంసీ గాంధీ పార్కులో శుక్రవారం నిర్వహించిన నిరసన ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. ఈ సినిమాకి కేంద్ర సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇవ్వకుండా సిక్కు సంఘాలు అడ్డుకోవడం అవివేకం అన్నారు. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ చీకటి రోజులు ఇప్పటి తరానికి తెలియాల్సిన అవసరం ఎంతయినా వుందన్నారు. హీరోయిన్ కంగనారనౌత్ అప్పులు చేసి మరీ ఈ సినిమా నిర్మించారని ప్రశంసించారు. సెన్సార్‌బోర్డులో వున్నది భారతీయులా లేక ఖలిస్థాన్ ఉగ్రవాదాదులా అని ప్రశ్నించారు. ఈ సినిమా విడుదలయ్యే వరకు దేశంలోని మహిళాలోకం ఆమెకి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి నాయకులు దేవర శంకర్, సీతన్, ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనజాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు

నూతన కార్యవర్గం ఎన్నిక

సీతంపేట : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ (ఏపీఎస్ఆర్‌టీసీ) జై భీమ్ అసోసియేషన్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో జరిగింది. అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.కిరణ్ బుజ్జి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీపీఎస్ నారాయణ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షునిగా ఈ.కోటేశ్వరరావు, విశాఖ మెయిన్ డిపో అధ్యక్షునిగా ఎస్.ఎం.రావు, డిపో కార్యదర్శిగా ఎస్.చిరంజీవి, సింహాచలం డిపో నూతన అధ్యక్షుడిగా పి.వి.ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రస్తుతం ఉన్న జీవో నంబరు 70, 71 స్థానంలో 2019/1 సర్క్యులర్‌ను అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. అన్ని అలవెన్సులు మంజూరు చెయ్యాలని, సంస్థలో ఉన్న ఖాళీలు భర్తీ చెయ్యాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వై.రాంబాబు, వివిధ డిపోల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గంతో రాష్ట్ర నాయకులు

పెట్రోల్ బంక్ ఏర్పాటుకు సన్నాహాలు

సీతమ్మధార : సీతమ్మధారలో రెండవ పెట్రోల్ బంక్ మంజూరయింది. పౌర సరఫరాల సంస్థ ఇప్పటికే సీతమ్మధార ప్రెస్‌క్లబ్ పక్కన ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మరో పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ నేపథ్యంలో ఇక్కడి బస్టాప్ సమీపంలో గల ఫుట్‌పాత్ మీద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం సిబ్బంది గోతులు తవ్వుతున్నారు. పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయనున్న స్థలంలో ప్రస్తుతం ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ని ఇక్కడి ఫుట్‌పాత్ మీదకు తరలించనున్నారు. ఇందులో భాగంగానే ఫుట్‌పాత్ మీద గోతులు తవ్వుతున్నారు. ఇక్కడ రెండో పెట్రోల్ బంక్ వస్తే వాహన చోదకులకు మరింత సౌలభ్యంగా ఉంటుందని భావిస్తున్నారు. ప్రభుత్వమే స్వయంగా పెట్రోల్ బంక్ నిర్వహిస్తే కొలతల విషయంలో కచ్చితత్వం ఉంటుందని, కల్తీకి ఆస్కారం వుండదని ప్రజలు భావిస్తున్నారు. త్వరలోనే ఇక్కడ పెట్రోల్ బంక్ ఏర్పాటు పనులు ప్రారంభిస్తారని సమాచారం.

బృందగాన పోటీలకు ఆహ్వానం

దాబాగార్డెన్స్ : సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ, భారత్ వికాస్ పరిషత్ విశాఖ శాఖ, ఝాన్సీ లక్ష్మీబాయి మహిళా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థుల్లో దేశ భక్తి పెంపొందించే విషయమై జాతీయ దేశ భక్తి బృందగాన పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, ప్రోగ్రామ్ కన్వీనర్ పి. వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపాన గల ఆర్యవైశ్య యువజన సంఘం భవనం వేదికగా నిర్వహించనున్న ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఒక్కో గీతానికి 6 నుంచి 8 మంది వరకు విద్యార్థులు పాల్గొనవచ్చునెతెలిపారు. విద్యార్థులు అక్కయ్యపాలెం వాగ్దేవి పాఠశాల లేదా వాట్సాప్ నంబర్ల ద్వారా ఉచితంగా దరఖాస్తు స్వీకరించి పాల్గొంటున్నట్టుగా పూర్తి వివరాలతో పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆమోదముద్రతో కూడిన లేఖ అదే పాఠశాలకు దరఖాస్తులో సహా ఈ నెల 10వ తేదీలోగా అందజేయాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 92466 22563, 98488 85186 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

పదోన్నతి పొందిన పోలీసులకు సీపీ సన్మానం


పదోన్నతి పొందిన సిబ్బందితో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ సిబ్బందికి ప్రమోషన్లు లభించాయి. సివిల్‌తోపాటు ఏఆర్‌లో ఉన్న హెడ్ కానిస్టేబుళ్లకు పదోన్నతులకు కల్పిస్తూ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు. శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో మూడో విడత ప్రమోషన్ మేళా నిర్వహించారు. సిబ్బంది సంక్షేమానికి తొలి ప్రాధాన్య ఇస్తున్న సీపీ కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతూ పదోన్నతి పొందిన సిబ్బందిని సత్కరించారు. పదోన్నతి ర్యాంకులతోపాటుగా పోస్టింగ్ ఆర్డర్ అందజేశారు. మూడో విడతలో కమిషనరేట్‌కు చెందిన ఒక హెడ్ కానిస్టేబుల్‌కు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా, ఏడుగురు ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుళ్లకు ఏఆర్ ఎస్‌ఐలుగా, ఆరుగురు ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుళ్లకు ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. వీరిని కుటుంబ సభ్యులతో ఆహ్వానించి సీపీ చేతుల మీదుగా ర్యాంకులు, పోస్టింగ్ ఆర్డర్లను స్వయంగా అందించారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ కె.ఫక్కీరప్ప, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పశువులమయంగా గ్రీన్‌బెల్టు స్థలం


అధ్వానంగా ఉన్న గ్రీన్ బెల్టు స్థలం

సీతమ్మధార : జోన్-3 పరిధిలో పలు గ్రీన్‌బెల్టు స్థలాలు అధ్వాన్నంగా తయారవుతున్నా ఉద్యాన విభాగం అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇక్కడి 24వ వార్డు రేసపువానిపాలెం సచివాలయం సమీపంలో గల గ్రీన్‌బెల్టు స్థలం ఫెన్సింగ్‌ను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అప్పటి నుంచి ఇక్కడ ఆవులు తిష్ట వేసి పచ్చదనం మాయం చేస్తున్నాయి. పచ్చదనం కోసం ఎన్నో ఏళ్ల క్రితం జాతీయ రహదారి పొడవునా గ్రీన్‌బెల్టులు ఏర్పాటు చేయడం తెలిసిందే. అయితే వాటిని కొందరు స్వార్థపరులు ఆక్రమించుకున్నా పట్టించుకున్న నాథుడే కరవయ్యాడు. అలాగే గ్రీన్‌బెల్టు స్థలాల్లో అసాంఘిక కార్యకలాపాలు కూడా జోరుగా సాగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మందు పార్టీల తర్వాత సీసాలు, గ్లాసులు ఇక్కడే పేరుకుపోయి జుగుప్స కలిగిస్తున్నాయి. ఇప్పటికైనా జోన్-3 ఉద్యాన విభాగం అధికారులు, పబ్లిక్ వర్క్స్ ఇంజినీర్లు స్పందించి గ్రీన్‌బెల్టు స్థలంలో ఫెన్సింగ్ పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని నర్సుల నిరసన

మహారాణిపేట : వైద్య ఆరోగ్యశాఖలో ఏఎన్‌ఎంలుగా పని చేస్తున్న వారికి జీఎన్‌ఎంలుగా శిక్షణ ఇచ్చి రెగ్యులర్ పోస్టింగుల్లో నియమించాలని కోరుతూ నర్సులు ఆందోళన చేపట్టారు. శుక్రవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ స్టేట్ కో-ఆర్డినేటర్ జి. కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు లలిత, ప్రధాన కార్యదర్శి టి.జి.ఎస్.ఎన్. కుమారి ఆధ్వర్యంలో జరిగిన నిరసన ప్రదర్శనలో నర్సులు నల్లబ్యాడ్జీలు ధరించి పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్య విభాగంలో ఏఎన్‌ఎంలుగా పని చేస్తున్న వారికి జీఎన్‌ఎంలుగా ట్రైనింగ్ ఇచ్చి రెగ్యులర్ పోస్టుల్లో స్టాఫ్ నర్సులుగా నియమించాలని డిమాండ్ చేశారు. ఏఎన్‌ఎంలకు స్టాఫ్ నర్సులుగా పదోన్నతి కల్పించడం అన్యాయం అన్నారు. దానికి సంబంధించిన జీవో నంబర్ 115ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే 9వ తేదీ సోమవారం నుంచి విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న దాదాపు 11,500 మంది స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఐదుగురు స్టాఫ్ నర్సులను నియమించాలనే పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సూపరింటెండెంట్‌కు అందజేశారు.


నిరసన ప్రదర్శనలో పాల్గొన్న నర్సులు

క్విజ్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

మహారాణిపేట : జాతీయ పోషకాహార వారోత్సవాలను పురస్కరించుకుని ఆంధ్రా మెడికల్ కాలేజీలోని కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఎంబీబీఎస్ విద్యార్థుల కోసం ఇంటర్ కాలేజియేట్ క్విజ్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ వైద్య కళాశాలల నుంచి 36 బృందాలు పాల్గొన్నాయి. ఆంధ్రా మెడికల్ కాలేజీ మొదటి బహుమతి రూ.5 వేలు కైవసం చేసుకోగా, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.3 వేలు, రూ.2 వేలు శ్రీకాకుళంలోని గ్రేట్ ఈస్టర్న్ మెడికల్ స్కూల్ (జీఈఎంఎస్) జట్లు గెలుచుకున్నాయి. విజేతలకు ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ ఎ.కృష్ణవేణి నాయకత్వం వహించారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

కెనరా బ్యాంక్ ఉద్యోగి బాల సుబ్రహ్మణ్యం మృతి

మహారాణిపేట : కెనరా బ్యాంక్ ఉద్యోగుల సంఘం నాయకుడు దేవరకొండ బాల సుబ్రహ్మణ్యం స్వామి గుండె నొప్పితో మృతి చెందారు. గురువారం రాత్రి ఛాతీలో నొప్పి రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ బాల సుబ్రహ్మణ్యం మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ప్రధాని మోదీఈ ప్రవేశ పెట్టిన ముద్ర రుణాలను చిరు వ్యాపారులకు ఇవ్వడంలో బాల సుబ్రహ్మణ్యం చురుగ్గా పని చేశారు. కెనరా బ్యాంకు ద్వారా ఎంతో మంది చిరు వ్యాపారులకు రుణాలు అందజేసిన బాల సుబ్రహ్మణ్యం మృతి తీరని లోటు అని బీజేపీ రాష్ట్ర వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్ అన్నారు. శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. బాలసుబ్రహ్మణ్యం మృతి పట్ల పలువురు కెనరా బ్యాంకు అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.


బాలసుబ్రహ్మణ్యం (ఫైల్)